

ముడా కమిషనర్‌గా కేఆర్ రక్షిత్



బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మైసూరు అభివృద్ధి ప్రాధికార (ముడా) భూస్వాధీన అధికారిగా వ్యవహరిస్తున్న కేఆర్ రక్షిత్‌కు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముడాకు సంబంధించి వివిధ కేసులు కోర్టులో కొనసాగుతున్న తరుణంలో పలువురు అధికారులు కమిషనర్‌గా వెళ్లేందుకు వెనుకడుగు వేశారు. ఈ నేపథ్యంలో భూస్వాధీన అధికారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అష్టదిగ్బంధం..!

- శృతి మించితే కొరడా ఝుళిపిస్తున్న అధిష్ఠానం
- ఏడాదిలో 8మంది సీనియర్ నేతలపై వేటు





ఈశ్వరప్ప | ఎస్‌టీ సోమశేఖర్ | శివరాం హెబ్బార్ | యత్నాళ్

బెంగళూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం క్రమ శిక్షణా చర్యలకు ఏ మాత్రం వెనకడాడం లేదు. ఏడాదికాలంలో రాష్ట్రానికి చెందిన 8మంది కీలక నేతలపై వేటు వేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమే కారణాలుగా చూపింది. తాజాగా మంగళవారం యశ్వంతపుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, యల్లాపుర ఎమ్మెల్యే శివరాం హెబ్బార్‌ను ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తూ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సభ్యత్వంతోపాటు పార్టీ ద్వారా పొందిన అన్ని పదవులనుంచి వారిని తొలగించారు. ఇద్దరు సుదీర్ఘకాలంపాటు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా కొనసాగారు. 2018 రాజకీయ సంక్షోభం ఏర్పడేందుకు వీరిద్దరూ కూడా కారకులే. కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన 17మంది ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామా చేయడంతో జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ తర్వాత బీజేపీలో చేరిన వీరిద్దరూ ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులుగా మూడున్నరేళ్లపాటు వ్యవహరించారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నుంచి రెండోసారి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. అయితే రాష్ట్రంలో అనూహ్యమైన మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటినుంచేవారు బీజేపీతో అంటీఅంటనట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లను పలుమార్లు పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా భేటీ అయ్యారు. ఏడాదిక్రితం లోక్‌సభ ఎన్నికల్లోనూ వారు బీజేపీకి అనుకూలంగా పనిచేయలేదు. వీటన్నింటి నేపథ్యంలోనే అధిష్ఠానం షోకాజ్ నోటీసు జారీ చేసినా వారు తీవ్రంగా పరిగణించలేదు. ఒక్కసారిగా ఇద్దరు ఎమ్మెల్యేలపైనా వేటు వేశారు.

అధ్యక్షుడిని వ్యతిరేకిస్తే అంతే సంగతి..

కాగా ఇటీవలే విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌ను సస్పెండ్ చేశారు. ఆయన పార్టీ అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు. పార్టీ సీనియర్ నేత యడియూరప్పను తరచూ విమర్శించేవారు. కొన్నేళ్లకాలంగా యడియూరప్ప వర్గానికి వ్యతిరేకంగానే కొనసాగారు. ఇటీవల మరికొంతమంది ఎమ్మెల్యేలతో కలసి రెబెల్ కూటమిని ఏర్పాటు చేశారు. ఈ అంశంపై అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించింది. ఆయనపైనా వేటు వేశారు. ఇలా కేవలం మూడు నెలల వ్యవధిలోనే ముగ్గురు ఎమ్మెల్యేలపై వేటు పడినట్టయ్యింది.

సీనియర్లనూ వదల్లేదు..

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే చిక్కబళ్ళాపుర ఎంపీగా కొనసాగుతున్న బచ్చేగౌడ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారు. మరోవైపు కుమారుడి శరత్ రాజకీయాలకోసం కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించాడు. దీంతో ఎంపీగా కొనసాగుతుండగానే బచ్చేగౌడపై అధిష్ఠానం చర్యలు తీసుకుంది. 2023 శాసనసభ ఎన్నికలకు ముందు దావణగెరె జిల్లా చన్నగిరి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మాడాళ్ విరూపాక్షప్పపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనపై వేటు వేశారు. విజయనగరకు చెందిన కవిరాజ్ అరసు, గోకాక్‌కు చెందిన అశోక్‌పూజారిలపైనా వేటు వేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన కేఎస్ ఈశ్వరప్ప గత ఎన్నికల్లో కుమారుడికి హావేరి ఎంపీ టిక్కెట్‌ను ఆశించారు. సాధ్యం కాకపోవడంతో నేరుగా ఆయనే ఇండిపెండెంట్‌గా శివమొగ్గ నుంచి పోటీ చేశారు. ఈ పరిణామంతో ఈశ్వరప్పపైనా వేటు వేశారు. ఇలా రెండేళ్ల వ్యవధిలో 8మందిపై వేటుపడింది. పార్టీలో ఏ మాత్రం క్రమశిక్షణ తప్పినా సహించేది లేదు అన్నట్లు అధిష్ఠానం వ్యవహరిస్తోందని పలువురు సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.



నెహ్రూ ప్రణాళికలతోనే
భారత్ నంబర్ వన్

- ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన మహనీయుడు
- వర్ధంతి కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం, డీసీఎం

బెంగళూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదితోనే భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థికశక్తి అయ్యిందని, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధికి కారణమైందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని విధానసౌధ తూర్పు ద్వారంలోని నెహ్రూ విగ్రహం వద్ద పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం కేపీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ దేశంలో పేదరికం తగ్గించేందుకు ప్రధానిగా నెహ్రూ ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. బ్రిటీష్ వారు లూటీ చేశాక దేశంలో ఎటువంటి సౌకర్యాలు లేని సమయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి దేశాన్ని నలుమూలలా ప్రగతి సాధించారన్నారు. పలు రంగాల్లో ఆయన సంస్కరణలతోనే అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. భారీ ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ వారికి దేశభక్తి తెలియదన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, హెచ్‌ఎం రేవణ్ణ, శరత్‌బచ్చేగౌడ, జీసీ చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తరణకు.. బ్రేక్..!



రెండేళ్ల సాధనా సమావేశంలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య (ఫైల్)



- కేబినెట్ విస్తరణపై మాట్లాడొద్దు
- అధిష్ఠానం ఆదేశం
- రెండున్నరేళ్ల పాలన ముగిసేదాకా నో చాన్స్..!

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణ జరగనుందని, మంత్రులుగా అవకాశం దక్కుతుందని ఆశపడుతున్నవారిపై అధిష్ఠానం నీళ్లు చల్లింది. కేబినెట్ విస్తరణ అంశం ప్రస్తావించరాదని, రాష్ట్రానికి సంబంధించి ఎటువంటి డిమాండ్లు అయినా రెండున్నరేళ్ల పాలన అయిన తర్వాతే అంటూ కాంగ్రెస్ అధిష్ఠానం తేల్చి చెప్పింది. అధిష్ఠానం వ్యాఖ్యలు రాష్ట్రంలో భిన్నమైన అభిప్రాయాలకు కారణమవుతున్నాయి. 2023 మేలో శాసనసభ ఎన్నికలు జరగగా 135 స్థానాలు కాంగ్రెస్ గెలుపు సాధించడంతో ప్రభుత్వం ఏర్పడేందుకు ఎవరి మద్దతు అవసరం లేకుండాపోయింది. కానీ ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య, డీకే శివకుమార్ పోటీపడ్డారు. ఢిల్లీలోనే ఇద్దరు నేతలు అనుచరులతో మకాం వేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ వరుస చర్చలు జరిపారు. చివరకు ప్రియాంకగాంధీ కూడా జోక్యం చేసుకుని ఓ తీర్మానం చేశారు. దీంతో ఫలితాలు ప్రకటించిన వారం రోజులతర్వాత సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైంది. డీకే శివకుమార్ యథావిధిగా కేపీసీసీ అధ్యక్షపదవిలో కొనసాగుతూనే డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధి, జలవనరులశాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. పూర్తిస్థాయి కేబినెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి వివాదంలో నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల వేళ నాగేంద్రకు మళ్లీ మంత్రి పదవి ఇస్తామని సీఎం సిద్దరామయ్య బహిరంగసభలో హామీ ఇచ్చారు. ఇలా దాదాపు ఏడాదికాలంగా మంత్రి పదవి కోసం నాగేంద్ర ఎదురుచూస్తున్నారు. మరోవైపు సీనియర్లను తొలగించి జూనియర్లకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ సుదీర్ఘకాలంగా కొనసాగుతూనే ఉంది. కేబినెట్ విస్తరణ జరిగితే అవకాశం ఉంటుందని భావిస్తున్నవారు ప్రయత్నాలు చేసుకుంటూనే ఉన్నారు. ఏడాదికాలంలో ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ ఆశావహులు క్యూకట్టేవారు. కాలినొప్పితో ముఖ్యమంత్రి మూడు నెలలపాటు హస్తినవైపు వెళ్లలేదు. చివరగా కర్ణాటక భవన్ ప్రారంభానికి వెళ్లినప్పుడు ఎమ్మెల్యేలందరూ వెళ్లారు. అధిష్ఠానంతో చర్చలు ఉంటాయని ఆశపడ్డారు. కానీ అధిష్ఠానం ఆ అంశాన్ని ప్రస్తావించకుండా పంపింది. ఈనెల 20తో సీఎం సిద్దరామయ్య రెండేళ్లపాలన ముగియడంతో భారీగా సంబరాలు జరిపిన సంగతి తెలిసిందే. అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా హాజరయ్యారు. రెండేళ్లు ముగియడంతో మంత్రివర్గంలో మార్పులు ఉంటాయని చర్చలు జోరుగానే సాగాయి. అనూహ్యంగా అధిష్ఠానం పెద్దలు విస్తరణకు సంబంధించి ఏ విధమైన ప్రస్తావనలు చేయలేదు.

సీనియర్లకు చెక్..!

రాష్ట్ర కేబినెట్ ఏర్పాటు సమయంలోనే సీనియర్లు అయిన ఆర్‌వీ దేశ్‌పాండే, ఎస్‌ఆర్ పాటిల్, బీకే హరిప్రసాద్, బసవరాజరాయరెడ్డి, బీఆర్ పాటిల్‌తోపాటు మరో ఆరేడుమందికి అవకాశం ఇవ్వలేదు. రెండేళ్లపాలనలో పలుమార్లు నాయకత్వ మార్పు అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల వేళ కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, పదిమంది సీనియర్ మంత్రులకు లోక్‌సభ ఎన్నికల బరిలో దించాలని ప్రయత్నించారు. కానీ మంత్రులు ఏడాదిలోనే రెండో ఎన్నికను ఎదుర్కొనలేమని అధిష్ఠానం వద్ద మొర పెట్టుకోవడంతో ఆ అంశానికి బ్రేక్ పడింది. అయితే ఆరేడుమంది సీనియర్ మంత్రులు వారసులకు టికెట్లు ఇప్పించుకున్నారు. తొలి ఏడాదితోపాటు ఇటీవల రెండేళ్లు ముగిసిన సందర్భంలోనూ మంత్రుల పనితీరుపై ప్రత్యేక సర్వే జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధిష్ఠానం చెంతకు నివేదిక వెళ్లినట్లు సమాచారం. ఆరేడుమంది మంత్రులు కనీసస్థాయిలో కూడా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేబినెట్‌లోకి చేరదలచుకున్నవారు ఎదురుచూపులకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డీకే వర్గీయుల్లో జోష్..

రెండున్నరేళ్ల పాలన ముగిసేదాకా ఎవరూ ఏ అంశాలను ప్రస్తావించరాదని అధిష్ఠానం ఆదేశించింది. రెండున్నరేళ్ల ప్రస్తావనను అధిష్ఠానమే వ్యాఖ్యానించడంతో నాయకత్వ మార్పు ఉంటుందని డీసీఎం డీకే శివకుమార్ వర్గీయుల్లో ఎనలేని సంతోషం వ్యక్తం అవుతుంది. అధిష్ఠానమే గడువుగురించి మాట్లాడడంతో ఆచితూచి వ్యవహరించాలని, ఇప్పుడే ఉబలాటం వద్దని డీసీఎం డీకే శివకుమార్ వర్గీయులు భావిస్తున్నారు. నాయకత్వ మార్పు అంశంగానీ, రెండున్నరేళ్ల గడువుకు సంబంధించిన విషయం అధిష్ఠానం పెద్దలకు మినహా మరెవ్వరికీ తెలియదు. కానీ సీఎం సిద్దరామయ్యకు ఆప్తులైనటువంటి కొందరు మంత్రులు ఎటువంటి మార్పులు ఉండవని, ఐదేళ్లు సీఎం సిద్దరామయ్య ఉంటారని అభిప్రాయపడ్డారు. తాజాగా కొత్త అంశాన్ని ప్రతిపాదించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవరాజ్ అరసు 7 సంవత్సరాల 11 నెలలపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అరసు రికార్డును సిద్దరామయ్య అధిగమించాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అదే జరిగితే 2026 ఏప్రిల్ దాకా సీఎం సిద్దరామయ్య కొనసాగాల్సి ఉంటుంది. సిద్దరామయ్య 2013 నుంచి ఐదేళ్లపాటు సీఎంగా కొనసాగారు. రెండో విడతలో రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. ఏడేళ్లు సీఎంగా వ్యవహరించగా మరో 11నెలలు కొనసాగాలని సిద్దూ మద్దతుదారులు భావిస్తున్నారు.



అలర్ట్..!

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ ప్రభావం పెరుగుతుండడం, ఇప్పటికే 70మందికి వైరస్ ప్రబలినట్లు నిర్ధారణ కావడంతో బెంగళూరు నగర ప్రజలు అలర్ట్ అయ్యారు. రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో వృద్ధులు, గర్భిణీలు మాస్కులతో బయటకు రావాలని సూచించిన సంగతి తెలిసిందే. గుంపులుగా చేరితో మాస్కులు ధరించాలని సూచించారు. దీంతో నగరంలో మాస్కులు ధరించేవారి సంఖ్య ఒక్కరోజులోనే పెరిగింది. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మాస్కులు ధరించి కనిపించారు. విద్యార్థులు కూడా మాస్కులతో బడులకు వెళ్లారు.



కేసీ ఆసుపత్రిలో మంత్రి దినేశ్‌గుండూరావు





కేఆర్ మార్కెట్ ప్రాంతంలో మాస్కుతో పోలీసులు, ప్రజల సంచారం

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

- టీడీపీ కర్ణాటక కన్వీనర్ రావిమోహన్ చౌదరి



బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ద్వారా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతితోపాటు అన్ని కులాలకు రాజకీయ పదవులు కల్పించిన ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కర్ణాటక పార్టీ కన్వీనర్ రావిమోహన్‌చౌదరి కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ 102వ జయంతి, 75ఏళ్ల నటజీవితం, తెలుగుదేశానికి 34 ఏళ్ల సంబరంలో కేంద్రప్రభుత్వం స్పందించి భారతరత్న ప్రకటించాలన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. సినిమారంగంలో ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యం తీసుకొచ్చి తెలుగుదేశం పార్టీద్వారా చారిత్రాత్మకంగా నిలిచిపోయే పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. మహానాడు దిగ్విజయంగా జరుగుతుండడం, పార్టీ అభిమానులందరికీ సంతోషకరమన్నారు. మహానాడుకు రెండు రాష్ట్రాల నుంచి భారీగా తరలి రావడం హర్షణీయమన్నారు. ఏపీలో అరాచక పాలనకు స్వస్తి పలికడం టీడీపీతోనే సాధ్యమయ్యిందన్నారు.

తుంగభద్రపై నిర్లక్ష్యం..!

- గేట్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోని ప్రభుత్వం
- టెండర్ల ప్రక్రియలోనూ అడ్డంకులే: బీజేపీ

బళ్లారి, మే 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర బీజేపీ నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తు చేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.



తుంగభద్ర డ్యాం గేట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

భార్యను హతమార్చి ఆత్మహత్య

విజయపుర, మే 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను తలపై మోది హతమార్చిన భర్త ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయపుర పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం పట్టణంలోని ఐదో వార్డు విజయనగర్ లే అవుట్‌లో నివాసం ఉంటున్న వెల్డింగ్‌షాప్ యజమాని బసవాచారి అలియాస్ శ్యామ్ (46) భార్య సుమ (38)ని డంబెల్స్‌తో కొట్టి భర్త హతమార్చాడు. ఆ తర్వాత ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్యామ్ హాసన్ జిల్లా వాసి సుమారు 25ఏళ్లుగా విజయపురలోనే ఉంటున్నారు. కుటుంబ కలహాలతోనే హతమార్చినట్లు డెత్‌నోట్‌లో రాసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఒకరు 9వ తరగతి, మరొకడు 7వ తరగతి చదువుతున్నారు. కుమారుడు పాఠశాల నుంచి రాగా రక్తపుమడుగులో తల్లి, ఫ్యాన్‌కు వేలాడుతూ తండ్రి ఉండడాన్ని గమనించి భయపడి వెంటనే పెదనాన్నకు సమాచారం తెలిపాడు. అతను చేరుకోగా ఇద్దరూ మృతి చెందినట్లు గుర్తించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ సీకే బాబా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయపుర పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



శ్యామ్, సుమా(ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1590.52	1,577.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,829	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	128	0
నీటి నిల్వ (టీఎంసీలు)	11.47	3.35

రేషన్ బియ్యం స్వాధీనం



లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బళ్లారి సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం విజయనగరం జిల్లా హొసపేటలో రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్మడానికి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టేకున్నారు. రూ.11.25 లక్షల విలువైన 331క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు బళ్లారి హబ్లీ జాతీయరహదారి 67లో జంబునాథ్ రోడ్డు వంతెన దగ్గర లారీని ఆపి పరిశీలించగా రేషన్ బియ్యం బయట పడినట్లు జిల్లా ఎస్పీ శ్రీహరి బాబు తెలిపారు. లారీ డ్రైవర్‌తో సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇవి బళ్లారి జిల్లాకు బియ్యం అని తేలిందన్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

● యువకుడు, చిన్నారి దుర్మరణం

బళ్లారి రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు, చిన్నారి మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిసిన వివరాల మేరకు ఆదివారం సాయంత్రం బళ్లారి నగరంలో ఏడు మొక్కుల తాయమ్మదేవి ఆలయ సమీపంలో గుగ్గిరట్టికి చెందిన అబ్దుల్ అర్మాన్ (21), కుమారి కుశాషియా నాజ్ (3) ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. టిప్పుసుల్తాన్ కళ్యాణ మండపం నుంచి ఇంటికి వెళ్తుండగా మరమ్మతుల కారణంగా రోడ్డు పక్కన ఆపిన ట్రాక్టరును బలంగా ఢీనడంతో చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన యువకుడిని 108 వాహనంలో విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హొస్పేట), మే 27(ఆంధ్రజ్యోతి): మైనార్టీ కమ్యూనిటీకి చెందిన లా గ్రాడ్యుయేట్లకు 2025-26 సంవత్సరానికి ప్రొఫెషనల్ ట్రైనింగ్ స్కాలర్‌షిప్‌ల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి గూడప్ప, జగలికొప్ప తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, జైన, బౌద్ధ, సిక్కు, పార్సీలతో సహా మైనార్టీ సమాజానికి చెందిన వారై వుండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థి బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలి. అభ్యర్థి వయసు 30 యేళ్ల కంటే తక్కువ వుండాలి.

జనన, మరణాల నమోదులో జాప్యం తగదు: డీసీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జనన, మరణ నమోదు ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాన్ వీడియో ఆడిటోరియంలో నిర్వహించిన పంట కోత ప్రయోగాలు, పంట క్షేత్ర పునర్వ్యవస్థీకరణ , జనన మరణ పౌర నమోదు వ్యవస్థ పురోగతి సమీక్షపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో వార్షిక జనన రేటు 30,000గా అంచనా వేశారన్నారు. ప్రతి నెలా ప్రతి ఆసుపత్రిలో ఎన్ని జననాలు జరుగుతున్నాయి. ఎంత మందికి జనన ధ్రువీకరణ పత్రాలు అందుతున్నాయి అనే దానిపై సమగ్ర సమాచారం రూపొందించాలన్నారు. ఈ విషయంలో సంబంధిత తాలూకా తహశీల్దార్ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. మరణాలను ఎలా లెక్కిస్తారని అడిగినప్పుడు జిల్లా కలెక్టర్.. సంబంధిత అధికారులను ఆస్పత్రుల్లో మాత్రమే లెక్కిస్తున్నట్లు అధికారులు తెలపడంపై డీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న మరణాలనూ తప్పకుండా లెక్కించాలని ఆదేశించారు.

జిల్లా సెన్సస్ అధికారి పత్రిబసప్ప మాట్లాడుతూ 2025 జనవరి నుంచి ఏప్రిల్ వరకు జిల్లాలో మొత్తం 9,188 జననాలు నమోదయ్యాయని వాటిలో 4,827మంది పురుషులు , 4,361 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అదే విధంగా 2025 జనవరి నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 4,384 సంఘటనలు నమోదయ్యాయని వాటిలో 2,608 మంది పురుషులు, 1.775మంది మహిళలు, 1లింగ మైనార్టీఉన్నారని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాలు 21రోజుల్లోపు జరిగితే ఉచితంగా పొందవచ్చు, సంఘటన 21నుండి 30రోజుల్లోపు జరిగితే రూ.20చెల్లించాలి. 30రోజుల తర్వాత అందితే రూ. 100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాల పంపిణీలో ప్రజలను అనవసరంగా తప్పుదారి పట్టించవద్దని జిల్లా మేజిస్ట్రేట్ అన్నారు. తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేయకపోవడం ముఖ్యమన్నారు. వ్యవసాయ గణన పనిలో ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన విత్తనాలు, విత్తనాలు వేయకపోవడం వంటి ప్రయోగాత్మక సమాచారిన్ని వివిధ రూపాల్లో ఆయా తాలూకాల తహశిల్దార్లు నమోదు చేయాలని ఆయన అన్ని తాలూకా తహసీల్దార్లకు తెలియజేశారు. ఈసమావేశంలో మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ సప్పండి,సండూర్ తాలూకా తహశీల్దార్ అనిల్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంత మంది.. కంది కోసమే..!

● విత్తనాల కోసం పోటెత్తిన రైతులు



దుకాణం వద్ద గుమిగూడిన రైతులు

బళ్లారి సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు సాగుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. దీంతో ఎరువులు, విత్తనాల కొనగోళ్లకు అన్నదాత దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు. మంగళవారం నగరంలోని కేసీ రోడ్డులోని కంది విత్తనాల కొనుగోలుకు తరలివచ్చారు. కంది విత్తనాలకు డిమాండ్ పెరిగినట్లు అధికారులు అభిప్రాయ పడుతున్నారు. కంది కిలోకు రూ. 140 చొప్పున నాలుగు కిలోల కంది విత్తనాలను అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అధిక డిమాండ్ కారణంగా రైతులకు టోకెన్లు అందించి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాల రైతులు విత్తన కొనుగోలుకు వస్తున్నట్లు తెలిపారు.

ఆగని వాన



మార్కెట్లో జడివానతో ఇబ్బంది పడుతున్న జనం

బళ్లారి, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జోరు వాన కొనసాగుతోంది. నగరంలో మంగళవారం ఉదయమే వర్షం కురుస్తుండంతో కార్యాలయాలు, దుకాణాలు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. మార్కెట్, దుకాణాలకు వెళ్లే వారు గొడుగులతో పరుగులు తీశారు. హొస్పేట్‌లో ఉదయమే వర్షం కురవడంతో మార్కెట్ చిందరవందరగా తయారయ్యింది.

ఆలయాల్లో అమావాస్య పూజలు

కంప్లి, మే 27(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కంప్లి, కురుగోడు, శిరిగేరి, కుడితిని తదితర గ్రామాలలో, పట్టణాలలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్వరుడి జయంతి సందర్భంగా నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. బుక్కసాగర్ వద్ద ఏడు పడగల నాగప్పకు, హులిగమ్మ దేవికి కురుగోడు వద్ద శ్రీశైల మల్లికార్జునస్వామి, షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవికు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. సిరుగుప్ప: సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికు అమావాస్య సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్‌లు దేవికి పుష్పాలంకార సేవలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.











నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెహ్రూకు ఘన నివాళి

బళ్లారిరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, నవభారత నిర్మాత భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలకంబపతి ఎల్ మారిన లిక్కర్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంత్రి నాగరాజు డీసీసీ కార్యదర్శి బోయపాటి విష్ణువర్దన్, గ్యారెంటీ అధ్యక్షుడు కేఈఈ చిదానందప్ప, ఉపాధ్యక్షుడు సంగనకల్లు విజయ్ కుమార్, డీసీసీ కార్యదర్శి ఈరన్నగౌడ్, వెంకటలక్ష్మీ, నారాయణ, పర్వీన్‌భాను, నసీమాభాను, చంద్రకళ, గీత, గౌసియా, మమత తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. చెల్లాచెదురైన మందులు



పడిపోయిన సెలైన్ బాటిళ్లు

కంప్లి, మే 27(ఆంధ్రజ్యోతి) : లారీ బోల్తా పడిన ప్రమాదంలో మందులు నేలపాలయ్యాయి. సోమవారం రాత్రి కొప్పళ జిల్లాలోని యలబురిగి తాలుకా మాటలాదిన్ని గ్రామ సమీపంలో మందుల లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. అందులో తరలిస్తున్న సెలైన్ బాటిళ్లు చెల్లాచెదరయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. లక్షల విలువైన మందులు చిందరవందరగా పడ్డాయి. మందులతో నిండిన లారీ గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు తెలిసింది. డ్రైవర్ మహమ్మద్ జాకీర్ హుస్సేన్, క్లీనర్ మహమ్మద్ పాషాలను గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలబురిగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

సర్వే గడువు పొడిగింపు

విజయనగరం (హొస్పేట), మే 27 (ఆంధ్రజ్యోతి) : జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్ దాస్ ఏకసభ్య విచారణ కమిషన్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల సర్వే వ్యవధిని మూడు దశల్లో పొడిగించిందని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటింటి సర్వే మొదటి దశను మే 29కి, పోలింగ్ బూత్ ప్రాంతాల వారీగా ప్రత్యేక శిబిరాలను మే 30 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. స్వీయ ప్రకటన వ్యవధిని జూన్ 1కి మార్చారన్నారు. ప్రజల సౌలభ్యం కోసం, విజయనగరంలోని సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సాంఘీక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాలలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సర్వే గురించి ఏదైనా సమాచారం పొందడానికి, విజయనగరం జిల్లా నోడల్ అధికారి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా నోడల్ అధికారి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి, కేబీ రామచంద్రప్ప 9141827465, విజయనగర్, రమేష్ 8095002829, హొస్పేట నజీమాబాను 9108777499, హగరి బొమ్మనహళ్లి, ఆనంద్ వై డొల్లిన 9901980762, కూడ్లిగి షహేఖా అహ్మదీ 8105909630, హడగలియ జ్యోతి 9482608061, హరప్పనహళ్లి గంగప్ప 9739094433 నెంబర్‌లో ఉన్నారని ఆ ప్రకటనలో తెలిపారు.

2న హరప్పనహళ్లిలో జనస్పందన

విజయనగరం (హొస్పేట), మే 27(ఆంధ్ర జ్యోతి): హరప్పనహళ్లి తాలుకాలోని అరిసికెరలోని శ్రీకోలశాంతేశ్వర మఠంలో జూన్ 2న ఉదయం 10 గంటలకు జనస్పందన నిర్వహించనున్నారు. జగళూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అధ్యక్షతన ఎన్నికైన ప్రతినిధులు, అన్ని జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో తాలుకా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ ఆదేశాల మేరకు జనస్పందన నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ ఫిర్యాదులు అందజేయవచ్చని అధికారులు తెలిపారు.

పౌర కార్మికులను పర్మినెంట్ చేయాలి



నగరసభ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పౌర కార్మికులు

సిరుగుప్ప, మే 27(ఆంధ్రజ్యోతి): పౌర కార్మికులను పర్మినెంట్ చేయాలని పౌర కార్మికుల సంఘం తాలుకా అధ్యక్షుడు కే వెంకోబ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో పౌర కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర కార్మికుల సంఘం అధ్యక్షులు వెంకోబ మాట్లాడుతూ.. ఏళ్లుగా సేవలు చేస్తున్నా ప్రభుత్వం పర్మినెంట్ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నగరం పరిశుభ్రంగా వుండేందుకు పౌర కార్మికుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ ఏఈ రమేష్, రెవెన్యూ అధికారులు రాజాబక్షి, పౌర కార్మికులు పంపాపతి, బాబు, షణ్ముఖ, రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగప్ప, పౌర కార్మికులు పాల్గొన్నారు.

వలసల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

● కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్ళారి సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల సమగ్ర సర్వేలో ఆయా నగరాలు, తాలూకాలు, గ్రామాల నుంచి పనుల కోసం వలస వచ్చిన షెడ్యూల్డ్ కుల కుటుంబాల సమాచారాన్ని చేర్చాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల సమగ్ర సర్వే 2025పై వివిధ సంఘాలు, సంస్థల సంఘనాయకులు ఆఫీ ఎబేరర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో 61,037 షెడ్యూల్డ్ కులాల గృహాలలో మొత్తం 3,04,468 షెడ్యూల్డ్ కుల జనాభా ఉంది. 57,385 కుటుంబాలు ఇప్పటికే సర్వే పూర్తి అయ్యిందన్నారు. మొత్తం 2,56,753 షెడ్యూల్ కులాల జనాభాను సర్వే చేశారు. 84శాతం పురోగతి ఉందని, వలస వెళ్ళిన లేదా సర్వేలో పాల్గొనడం మానేసిన మిగిలిన కుటుంబాల గురించిన సమాచారాన్ని సంబంధిత కమ్యూనిటీ నాయకులు అందించాలన్నారు. లెక్కింపులో ఎవ్వరినీ వదలకుండా నమోదు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, వివిధ షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, వివిధ సంఘాలు, సంస్థల ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు



విద్యాశాఖాధికారి గుర్రప్ప

సిరుగుప్ప, మే 27(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ సప్లిమెంటరీ పరీక్షకు 860 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖాధికారి గుర్రప్ప తెలిపారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో ఎస్ఈఎస్ బాలికల హైస్కూలు, విజయమేరీ హైస్కూలు రెండు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 1051 మంది పరీక్షలు దరఖాస్తు చేసుకోగా అందులో 860 మంది మాత్రం హాజరైనట్లు తెలిపారు. మార్చిలో ఫెయిలైన విద్యార్థులకు నేడు పరీక్షలు జరిపినట్లు ఆయన తెలిపారు.

హోసూరు జోన్



కుంభాభిషేకానికి ముస్తాబవుతున్న కోదండ రామాలయం

నేటినుంచి కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం

హోసూరు, మే 27(ఆంధ్రజ్యోతి): డెంకణీకోట తాలూకా కుందుమారనపల్లి గ్రామంలో కొలువైన కోదండరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ నేపథ్యంలో మూడు రోజులపాటు విశేష ఉత్సవాలు కొనసాగనున్నాయి. మహాగణపతి, నవగ్రహాలు, సంజీవరాయస్వామి, సీతారామ లక్ష్మణులు, శ్రీకృష్ణుడు రుక్మిణి, రమాదేవి సత్యనారాయణస్వామి విగ్రహాలను ప్రతిష్ఠాపన, నూతన విమాన గోపురములు, రాజగోపురము అష్టబంధన ప్రతిష్ఠాపన కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాశీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వేద బ్రహ్మ దినేశ్‌శర్మ ఆధ్వర్యంలో ఆగమశాస్త్రం ప్రకారం ప్రతిష్ఠాపన, కుంభాభిషేక కార్యక్రమాలు జరగనున్నాయి. బుధ, గురువారాలలో వివిధ హోమాలు నిర్వహించనుండగా శుక్రవారం కుంభాభిషేకం జరగనుంది. ఈనెల 31న శనివారం నుంచి 48రోజులపాటు మండలాభిషేక పూజలు కొనసాగనున్నాయి. కుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

రైతులకు శిక్షణ తరగతులు

హోసూరు, మే 27(ఆంధ్రజ్యోతి): హోసూరు బ్లాక్ పరిధిలో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విస్తరణ సహాయం, నిర్వహణ పథకం కింద కోస్తానపల్లిలో వ్యవసాయ అధికారులు పాల్గొని అవగాహన కల్పించారు. బయో ఫెర్టిలైజర్‌లు, సూక్ష్మపోషక ఎరువులు, సూడోమోనాస్ ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఆదియమాన్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ పద్ధతులు, నీటి వనరుల నిర్వహణపై వివరించారు. సమగ్ర తెగుళ్ల, వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. హోసూరు వ్యవసాయ అధికారి టీ రేణుక ప్రసంగిస్తూ సుసంపన్నమైన ఎరువు, వర్మీకంపోస్టు ప్రాధాన్యతను వివరించారు. ఏప పంటకు బిందుసేద్యం దోహదపడుతుందో తెలిపారు. హోసూరు డిప్యూటి వ్యవసాయ అధికారి మురుగేశన్ జొన్నలను నాటడం, సాగుపద్ధతులు, అంతర పంటల ప్రయోజనాల గురించి తెల్పుతూ అడవిపందుల నియంత్రణకు సాంకేతిక పద్ధతులను వివరించారు. ఆర్ముగం మాట్లాడుతూ పంటల బీమా ప్రయోజనం గురించి తెలిపారు. ఇలా వివిధ అధికారులు ప్రభుత్వ పథకాలతో పాటు పంటల సాగులో జాగ్రత్తలపై వివరించారు.



ప్రసంగిస్తున్న అధికారులు

కుండకు అండ ఏదీ?

● కులవృత్తినే నమ్ముకున్నాం.. ● మట్టి కుండల తయారీతోనే జీవనం
● గోడౌన్ సౌకర్యం, రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కుమ్మరుల వినతి



కుండలు తయారుచేస్తున్న జడెప్ప

కంప్లి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అందరికీ కులాల వారీగా పలు సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తోంది. కానీ కుమ్మర సమాజం మాత్రం సరైన వసతులు లేక ఆర్థికంగా వెనకబడిపోయామని మెట్రి కుమ్మర జడెప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కంప్లి తాలుకా పరిధి లోని మెట్రి గ్రామానికి చెందిన జడెప్ప తరతరలాలుగా కుమ్మర వృత్తినే నమ్ముకుని, జీవనం గడుపుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశపారంపర్యంగా వచ్చిన వృత్తిని నమ్ముకున్నామని, కుటుంబమంతా కుండల తయారీతోనే గడుపుతున్నామన్నారు. కానీ ఇప్పటికీ తమకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక రుణాలు కానీ, గృహవసతి కానీ కల్పించలేదన్నారు. వానాకాంలో తాము తయారు చేసిన కుండలు నిల్వ చేసుకునేందుకు కనీసం గోడౌన్ సౌకర్యం లేదన్నారు. ఎన్నోసార్లు స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు తమ గోడు చెప్పుకున్నా ఫలితం లేదన్నారు. గోడౌన్ లేకపోవడంతో ఎంతో కష్టపడి చేసిన మడకలు, కుండలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామన్నారు.

కుండలకు పెరిగిన డిమాండ్

ఇటీవల మట్టి కుండలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు కేవలం పేదోడి ఫ్రిడ్జ్‌గా పేరొందిన కుండలను ధనికులు సైతం ఆదరిస్తున్నారు. ఆర్యోరీత్యా మట్టి పాత్రలు శ్రేయస్కరమని భావిస్తుండంతో కుండలు, పాత్రలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఫ్రిడ్జ్‌లో ఉంచిన నీళ్ల కన్నా మట్టి కుండలోని నీటికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మట్టికుండలో తయారు చేసేందుకు సండూరు తాలుకా గ్రామం వద్దకు వెళ్లి రూ. ఆరు వేలు నుండి రూ. ఏడు వేలు వరకు ట్రాక్టర్ బాడుగ ఇచ్చి మట్టిని తీసుకొస్తున్నామని జడెప్ప తెలిపారు. తీసుకొచ్చిన మట్టిలో సుమారు రూ. 50 వేల నుంచి రూ.60 వేల వరకు వచ్చే కుండలు, పాత్రలు తయారు చేస్తామని తెలిపారు. డిమాండ్ పెరిగిన దృష్ట్యా గోడౌన్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఎంతో మేలని కుమ్మరులు కోరుతున్నారు.



మట్టితో చేసిన పాత్రలు



గోడౌన్ లేక ఆరుబయటే ఉంచిన కుండలు

ఉన్నత నిర్ణయం..!

ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు తీపికబురు





ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం కసరత్తు

సచివాలయ ఉద్యోగులకు సర్వే బాధ్యతలు

2023-24లో మూడు విడతలు పెండింగ్

అనంతపురం సెంట్రల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను కొత్త ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చనుంది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన వాటిని చెల్లించేందుకు ముందుకు రావడం ఎంతో ఉన్నత నిర్ణయం అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో మూడు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఆ మేరకు సర్వేకి సైతం శ్రీకారం చుట్టింది. సర్వే బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది.

24 నుంచి సర్వే

కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులు, సర్టిఫికెట్లకు సంబంధంలేకుండా ఇప్పటికే విద్యార్థులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలల ఖాతాలకే జమచేసే పద్ధతి ప్రవేశపెట్టింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలను చెల్లించేలా కసరత్తు చేపట్టింది. 2023-24 విద్యా సంవత్సరానికి సబంధించిన నాలుగు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో మూడు విడతలను గత ప్రభుత్వం బకాయిపెట్టింది. దీంతో విద్యార్థులే సొంతంగా కళాశాలకు ఫీజులు కట్టారు. ఇలా 2, 3, 4 విడతలకు సంబంధించిన ఫీజులు కట్టిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? కళాశాలలకు ఫీజులు చెల్లించినట్లు రసీదులేమైనా పొందారా? ఫీజులుకట్టి బిల్లులు పొందని వారెంతమంది? ఉన్నారన్న అంశాలపై ఈనెల 24వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఏ విద్యార్థీ నష్టపోకుండా వారంరోజుల్లో పూర్తిచేయాలని సర్వే బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. దీంతో దాదాపు 42వేల మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత శాఖ లెక్కలు చెబుతున్నాయి.



నాలుగేళ్లు ఇబ్బందులు..

డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వమే కళాశాలల ఫీజులను రీయింబర్స్ చేస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ప్రవేశపెట్టినప్పట్నుంచి కళాశాలల ఖాతాలకే నేరుగా రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. కళాశాలలతో తమకు సంబంధంలేదన్న తరహాలో ఫీజుల అంశాన్ని గత ప్రభుత్వం విద్యార్థులకు ముడిపెట్టింది. ఏడాది ఫీజును నాలుగు విడతలుగా విభజించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేది. దీంతో తల్లుల ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను జమచేయకున్నా.. విద్యార్థుల తల్లిదండ్రులే వారి జేబుల నుంచి ఫీజులు చెల్లిస్తూవచ్చారు. పరీక్ష ఫీజులు కట్టించుకోవాలన్నా, హాల్ టిక్కెట్లు ఇవ్వాలన్నా, సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా సంబంధిత విద్యార్థి కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చేది. ఇలా నాలుగు సంవత్సరాలపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులకా.. కళాశాలలకా...

ప్రైవేటు, ప్రభుత్వం అన్న తేడాలేకుండా విద్యార్థుల ముక్కుపిండి కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేశాయి. సిఫార్సులున్న కొద్ది మంది విద్యార్థులకు మాత్రమే మినహాయింపు ఇచ్చాయి. అందులోనూ సిఫార్సులు చేసిన వారిని షూరిటీగా పెట్టుకుని ఫలానా తేదీ చెల్లిస్తామని హామీ తీసుకుని వెసులుబాటు కల్పించాయి. దీంతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులు సొం తంగా ఫీజులు కట్టుకున్నారు. ఈ క్రమంలో సర్వే అనంతరం మూడు విడుతల బకాయి మొత్తాన్ని విద్యార్థులకు చెల్లించాలా? కళాశాలలకు ఇవ్వాలా? అన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. నివేదికలు వచ్చిన తరువాత విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతి విద్యార్థీ సర్వే చేయించుకోవాలి



2023-24లో ఫీజు రీయింబర్స్ మొత్తాలు అందని ప్రతి విద్యార్థీ వీలైనంత త్వరగా సమీపంలోని సచివాలయానికెళ్లి సర్వే చేయించుకోవాలి. ఒకటో విడత ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించారు. మిగిలిన 2, 3, 4 విడతలకు సబంధించిన బకాయిలను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. తద్వారా డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే దాదాపు 42వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకు కళాశాలకు చెల్లించిన ఫీజు రసీదులను సచివాలయంలో అప్‌లోడ్ చేయించాలి. రసీదులు లేకపోతే కళాశాల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకుని, అప్‌లోడ్ చేయాలి. సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనిగానీ సంక్షేమం, విద్యా సహాయకులనుగానీ సంప్రదించాలి.

- రాధిక, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి

శారదాలో సందడి..!

బదిలీలు.. ప్రమోషన్‌లకు క్యూ

వెరిఫికేషన్‌కు వచ్చిన ఉపాధ్యాయులు



సర్టిఫికెట్లు, ఎస్ఆర్‌లు పరిశీలిస్తున్న స్ర్కూటినీ కమిటీ సభ్యులు

అనంతపురం విద్య, మే 27(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియతో ఉపాధ్యాయులల్లో సందడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు అనంతపురం శారదా స్కూల్ వేదిక అయింది. వందలాది మంది టీచర్లు, సంఘాల నేతలతో శాదరా స్కూల్ ప్రాంగణం మంగళవారం కిటకిటలాడింది. గ్రీవెన్సులు, ఫిర్యాదులు, వేకెన్సీలు.. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు క్యూ కట్టారు. ఉమ్మడి జిల్లాలోని పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లు ఇచ్చేందుకు మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలో 3 పోస్టులు, జడ్పీలో 120 పోస్టులు, మున్సిపాలిటీల్లో 20 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పోస్టులకు (ప్రమోషన్ల కోసం) అర్హులైన పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను 1:3 చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. ప్రభుత్వ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న 3 పోస్టులకు కడపలో వెరిఫికేషన్ నిర్వహించారు. మిగిలిన 145 పోస్టులకు శారదా స్కూల్‌లో 7 కౌంటర్లలో వెరిఫికేషన్ నిర్వహించారు. వెరిఫికేషన్ కమిటీలోని ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓ, డీఈఓ ఆఫీస్ స్టాఫ్ స్ర్కూటినీ చేశారు.

దరఖాస్తు చేయని 376 మంది ఎస్‌జీటీలు

ఎనిమిదేళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ఈ జాబితాలోని ఎస్‌జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం ఆఖరి రోజు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 376 మంది ఎస్‌జీటీలు దరఖాస్తు చేయలేదు.

భర్త వెంటే భార్య..

- అనారోగ్యంతో భర్త మృతి
- అంత్యక్రియల రోజునే భార్య కూడా..
- రోదించి.. రోదించి.. ఆగిన గుండె



రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవమ్మ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, మే27(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలపాటు తనతో కలిసే ఉన్న భర్త మృతిని భార్య భరించలేకపోయింది. భర్త శవాన్ని చూసి రోదించి.. రోదించి.. భార్య గుండె ఆగింది. భర్త అంత్యక్రియల రోజునే ఆమె కూడా మరణించింది. భర్తతో కలిసే వెళ్లిపోయింది. దీంతో దంపతులకు కలిసే అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని బోయపల్లిలో ఈ ఘటన జరిగింది. గ్రామంలో బెల్లం రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు నివాసం ఉండేవారు. వీరికి ముగ్గురు కుమారులు. ఇద్దరు ఇంటివద్ద ఉండగా, మూడో కుమారుడు సాంబశివారెడ్డి అమెరికాలో ఉంటున్నారు. రామచంద్రారెడ్డి(80) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కుమారుడు అమెరికా నుంచి మంగళవారం వచ్చారు. రామచంద్రారెడ్డి మృతదేహాన్ని అలాగే ఉంచారు. తండ్రి మృతదేహాన్ని చూసి ముగ్గురు కుమారులు బాధపడుతుండగా లక్ష్మీదేవమ్మ(70) కన్నీటి పర్యంతమైంది. బోరున విలపించింది. ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే బంధువులు, కుమారులు గమనించగా.. అప్పటికే ఆమె మృతిచెందింది. దంపతుల మృతితో కుమారులతోపాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. దంపతుల మృతదేహాలకు కలిసే అంత్యక్రియలు నిర్వహించారు.



ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయం



కమీషన్ల మేడం...!

ఉద్యోగోన్నతులకు రూ.లక్షల్లో గుంజుడు

- పైసలిస్తేనే బిల్లులపై సంతకాలు
- పోషణ్‌బీ.. పడాయిబీలో భారీ దోపిడీ

ధర్మవరం ఐసీడీఎస్‌లో అడుగడుగునా అక్రమాలే

ధర్మవరం, మే 27(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పనిచేసే అధికారిణి అరాచక పర్వంతో కమీషన్ల మేడమంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు. ఉద్యోగోన్నతి, బిల్లు ఏదైనా ఫైల్ ముందుకు కదలాలంటే పైసలిచ్చుకోవాల్సిందే. లేదంటే కొర్రీలు వేస్తూ కాలయాపన చేస్తుంటారు. ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు వివిధ రకాల పౌష్టికాహారంతో పాటు కాయగూరలు, అద్దెలు, సమావేశాల పేరుతో ప్రతినెలా లక్షల్లోనే అక్రమార్జన చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ఆమె కొనసాగుతున్నారు. ఎవరైనా ఎదిరిస్తే వారికి చుక్కలు చూపిస్తుందని ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. అడిగినంత ముడుపులు చెల్లిస్తే అనర్హులకు సైతం ఉద్యోగోన్నతులు కల్పించడంలో ఆమె దిట్ట అని తెలుస్తోంది. ఉద్యోగోన్నతి దక్కాలంటే ఐసీడీఎస్‌లోని కొందరు లీడర్లు రంగ ప్రవేశం చేసి మధ్యవర్తిగా ఉంటూ భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ముడుపులు ఇవ్వకపోతే ఎన్నేళ్లయినా అదేపోస్టులో ఉండిపోవాల్సి వస్తుందని భయాందోళనకు గురిచేస్తుండటంతో అప్పులు చేసి అడిగినంత ఇచ్చి ఉద్యోగోన్నతి దక్కించుకునే పరిస్థితి నెలకొంది.

పోషణ్‌బీ.. పడాయిబీలో భారీ అవినీతి

కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంతోపాటు సృజనాత్మకతను వెలికి తీయడానికి పోషణ్‌బీ.. పడాయిబీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇద్దరు సూపర్‌వైజర్లతో పాటు సీడీపీఓ హోదాలో ప్రత్యేక శిక్షణ పొంది.. ఆ మెళకువలను స్థానికంగా వర్కర్లు, ఆయాలకు తెలియజేయాలి. ఈ మేరకు ఇటీవల మూడురోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. 250 మందికి శిక్షణ ఇచ్చినట్టు రికార్డుల్లో చూపారు. ఒక్క రోజు భోజనానికి రూ.75వేలు అలా మూడు రోజులకు కలిపి రూ.2.25 లక్షలు, ట్రైనింగ్ మెటీరియల్ కింద (బ్యాగు, పెన్ను, రైటింగ్ ప్యాడ్) కోసం రూ.25వేలు, అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఒక్కొక్కరికి రూ.150 చొప్పున కేటాయించారు. టీఏ, డీఏ మాత్రం సక్రమంగా అందజేయగా మిగిలిన అన్నింటిలోనూ భారీగా అవినీతికి పాల్పడినట్టు తెలుస్తోంది. నాసిరకం భోజనాలు ఏర్పాటుచేసి రూ.లక్షల్లో కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సూపర్‌వైజర్లతోనే మూడు రోజుల శిక్షణ ముగించినట్టు ఆరోపణలు ఉన్నాయి.





- లక్ష్మీచెన్నకేశవపురంలో ఓ ఆయా అంగవైకల్యం లేకపోయినా తనకున్న పలుకుబడితో దొంగ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగోన్నతి పొందినట్లు తెలుస్తోంది. అందుకు గాను మేడంకు సుమారు రూ.5 లక్షల దాకా ముడుపులు అందినట్టు విశ్వసనీయ సమాచారం.
- సంజయ్‌నగర్-1వ కేంద్రంలో ఖాళీ పోస్టుకు నోటిఫికేషన్ వచ్చినా అక్కడ భర్తీ చేయకపోవడం వెనుక అమ్యామ్యాలు ఇవ్వడానికి ఎవరు ముందుకు రాకపోవడమే కాణమని తెలుస్తోంది.
- శారదానగర్‌లో ఓ ఆయా ఉద్యోగోన్నతి వ్యవహారం కోర్టులో ఉంది. మేడంతో ఒప్పందం కుదరడంతో కోర్టులో పెండింగ్ ఉన్నా ఉద్యోగోన్నతి ఇచ్చినట్టు తెలుస్తోంది. దీని వెనుక రూ.లక్షలు చేతులు మారినట్టు ఆ శాఖ ద్వారానే తెలుస్తోంది.
- చిన్నూరు బత్తలపల్లిలో అంగన్‌వాడీ వర్కర్‌పోస్టు ఎస్సీలకు కేటాయించారు. ప్రస్తుతం అక్కడ ఎస్సీ మహిళ పనిచేస్తోంది. సహాయకురాలి పోస్టును బీసీలకు కేటాయించాలని అక్కడ ప్రజలు కోరినప్పటికీ.. ఎస్సీల లోనే ఓ వ్యక్తి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుని ఆయా పోస్టును కేటాయించినట్టు విమర్శలు ఉన్నాయి.
- రాజేంద్రనగర్ 4వ కేంద్రంలో ఓ ఆయాకు ఉద్యోగోన్నతి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకపోవడం వల్లే ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది.
- రాంనగర్‌లో ఓ అంగన్‌వాడీ వర్కర్ రాజీనామా చేయగా.. కొన్ని నెలలు పాటు హాజరు చూపించి జీతం నొక్కేసినట్టు తెలుస్తోంది. ఇందులో వర్కర్, మేడం చెరిసగం పంచుకున్నట్టు సమాచారం.
- ఈ ఏడాది ఇచ్చిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఇంటర్వ్యూలు నిర్వహించి వర్కర్లు, హెల్పర్లకు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కొత్తగా చేరిన ఆయాలు, వర్కర్లు మామూళ్లు ఇవ్వకపోవడంతో ఇప్పటికీ వారు జీతం అందుకోలేని పరిస్థితి నెలకొంది.

మా దృష్టికి రాలేదు

ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు మా దృష్టికి రాలేదు. ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే విచారిస్తాం. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటాను.

-శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

బాలికలపై వివక్ష రూపుమాపాలి

జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం

పుట్టపర్తిరూరల్, మే27(ఆంధ్రజ్యోతి): బాలికలపై వివక్ష రూపుమాపాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం తెలిపారు. జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు, సూపర్ వైజర్లతో ఆమె మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. బాలికలపై వివక్ష రూపుమాపేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, అంగన్‌వాడీలను సమన్వయం చేసుకుని గర్భవతులు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

మార్కెటింగ్ శాఖలో

బదిలీలు

అనంతపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బదిలీలు మంగళవా రం జరిగాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 23 మంది, ఐదేళ్లు పూర్తి కాని 22 మంది కలిపి మొత్తం 45 మం దిని బదిలీ జాబితాలో చేర్చారు. వీరికి గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం బదిలీల ప్రక్రియ నిర్వహించారు.

శివశక్తి స్వరూపం.. సత్యసాయి..

- అలరించిన నాటిక

పుట్టపర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): శివశక్తి స్వరూపం సత్యసాయి అంటూ బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక భక్తులను మైమరపింపజేసింది. తమిళనాడులోని ఈరోడ్, సేలం జిల్లాలకు చెందిన భక్తులు పర్తియాత్రగా మంగళవారం ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభామండపంలో సాయిమధురం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. బాలవికాస్ విద్యార్థులు శ్రీసత్యసాయి శివశక్తి స్వరూపం అంటూ నాటికను ప్రదర్శించారు. సత్యసాయి ప్రేమతత్వంపై నాటికతోపాటు నృత్యప్రదర్శన చేపట్టారు. గంటపాటు చిన్నారులు తమ పాటలు, నాటికతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నాటికలోని సన్నివేశాలు

పీఆర్ ఇంజనీర్లకు బదిలీల కౌన్సెలింగ్

- అందరూ పీఐయూ, క్యూసీలకు వెళ్తామంటే కుదరదు
- ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ ఇంజనీర్లకు మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం పంచాయతీ రాజ్ సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతపురం ఎస్ఈ జహీర్ అస్లామ్, కడప ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, కర్నూలు ఎస్ఈ రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఎన్‌సీ బాలు నాయక్ అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రాజెక్ట్ ఇంప్లిమేంటేషన్ యూనిట్ (పీఐయూ), క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) విభాగాలు కావాలంటే కుదరదు. పీఆర్‌ఐలో క్షేత్రస్థాయి ప్లేసులు ఆప్షన్ ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు, కార్యాలయాల్లో మకాం వేసిన వారు తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిందేనని చెప్పారు. స్పౌజ్, ఆరోగ్య సమస్యలతో ఆధారాలు చూపిన వారికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. అనంతపురం సర్కిల్ కార్యాలయంలో జేఈఈలు శ్రీనివాసకుమార్, లక్ష్మిదేవిలు ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఉన్నారు. శ్రీనివాసకుమార్ సెప్టెంబరులో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండటంతో ఆయనను అక్కడే ఉంచారు. లక్ష్మిదేవిని పెనుకొండకు కేటాయించారు. అదే తరహాలో పీఐయూ సూపరింటెండెంట్ ఐదేళ్లు పూర్తి కావడంలో స్థాన చలనం తప్పలేదు.

ఉమ్మడి జిల్లా బదిలీ వివరాలు

అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న డీఈఈల్లో నలుగురు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో రవీంద్ర కుమార్, భరత్‌ప్రకాష్‌రెడ్డి, మురళీధర్, మధుప్రకాష్ ఉన్నారు. వీరిలో భరత్‌ప్రకాష్‌రెడ్డి ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో మినహాయింపు ఇచ్చారు. మిగిలిన ముగ్గురు పలు కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవడంతో స్థాన చలనం లేకుండా జాగ్రత్త పడ్డారు. అదే తరహాలో జేఈఈలు ఏడుగురు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో ముగ్గురు స్థాన చలనం పొందారు. మిగిలిన వారు పలు కేటగిరీల కింద పాత స్థానాల్లోనే ఉండిపోయారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పంచాయతీ రాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్



రక్షిత మృతదేహం

పెళ్లి వద్దనలేక యువతి ఆత్మహత్య

అగళి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రక్షిత(22) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వీరేష్ తెలిపిన మేరకు రక్షిత రొళ్ల మండలం ఎం.రాయాపురం గ్రామానికి చెందిన పునిత్‌ను ప్రేమించింది. ఇరుకుటుంబాల వారు ఒప్పుకుని పెళ్లి చేయాలని నిశ్చయించారు. పునీత్ మద్యం సేవిస్తాడని, చెడు అలవాట్లు ఉన్నాయని తెలుసుకున్న రక్షిత తనలో తాను బాధపడుతూ ఇంట్లో చెప్పలేక, పెళ్లి చేసుకోలేక తీవ్రంగా కుంగిపోయింది. ఈక్రమంలో సోమవారం రాత్రి జీవితంపై విరక్తిచెంది ఇంటిపైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి నన్న బూతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విస్తారంగా వర్షాలు

బుక్కరాయసముద్రం, మే 27(ఆన్‌లైన్): నైరుతి రుతుపవనాల ప్రభావం, అల్పపీడన ద్రోణి కారణంగా ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి మంగళవారం తెలిపారు. తేలికపాటి నుంచి 12 మి.మీ. వరకు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గాలి వేగం 16 కి.మీ. నుంచి 20 కి.మీ. ఉంటుందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 29.2 డిగ్రీల సెల్సియస్ నుంచి 31.2 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటలకు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు.

16 మండలాల్లో..

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 19.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.





మహానాడు సంబరం



కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.






నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎన్‌టీ రామారావు (జయంతి)




తెలుగువారి హృదయాలలో ఆరాధ్య దైవంగా, తెలుగుజాతి గొప్పదనాన్ని దశదిశలా చాటి 'అన్నగారు'గా నిలిచిన నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో జన్మించారు. నటుడిగానే కాక నిర్మాతగా, దర్శకుడిగా రాణించి రాజకీయాల్లో సైతం చరిత్ర సృష్టించారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో నటించి 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ'గా పేరొందారు. సుమారు 400 సినిమాలలో నటించారు. రాముడు, కృష్ణుడు వంటి పాత్రలతో చెరగని ముద్ర వేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యానికి అడ్డుకట్ట వేసేలా 1982లో 'తెలుగుదేశం' పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లో అధికారాన్ని దక్కించుకున్న ఘనత ఆయనది. మూడు దఫాలుగా ముఖ్యమంత్రిగా పని చేశారు. పద్మశ్రీ, నంది అవార్డులు, గౌరవ డాక్టరేట్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు. 1996 జనవరి 18న గుండెపోటుతో కన్నుమూశారు.

మైసూరు వాసుదేవాచార్ (జయంతి)



కర్ణాటక సంగీత వాగ్గేయకారుడు, 'పద్మభూషణ్' గ్రహీత మైసూరు వాసుదేవాచార్ (వాసుదేవాచార్య) 1865 మే 28న మైసూరులో జన్మించారు. త్యాగరాజ శిష్య పరంపరలో కొనసాగారు. 200 వరకు కృతులు ఉన్నాయి. సంస్కృతం, తెలుగులోనే అధికంగా ఉన్నాయి. బ్రోచేవారెవరురా, దేవాది దేవ శ్రీవాసుదేవ, మామవతు శ్రీ సరస్వతి భజరే రే మనసా, రారా రాజీవలోచనరామ వంటివి ఆయన రచించిన కృతులలో ఎక్కువగా వినిపించేవి. 'నెనపుగళు', 'నా కండ కళావిదరు' వంటి కన్నడ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కళాక్షేత్రలో ముఖ్య సంగీతజ్ఞుడిగా వ్యవహరించారు. 1961 మే 17న కన్నుమూశారు.

సురవరం ప్రతాపరెడ్డి (జయంతి)



సాంఘిక చైతన్యం అంటే గుర్తుకొచ్చే సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం జోగులాంబ గద్వాల) ఇటిక్యాలపాడు ప్రాంతంలో జన్మించారు. న్యాయ వాదిగా జీవితం ప్రారంభించి రచయితగా, పత్రికా సంపాదకులుగా, పరిశోధకుడిగా, పండితుడిగా, ప్రేరకుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా తెలంగాణ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. 354 కవులతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక' గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో ప్రచురించి సమాధానం ఇచ్చిన వైతాళికుడు. బహుభాషావేత్త, పత్రికా సంపా దకుడు, పత్రికా రచయితగాను పేరొందారు. ఆంధ్ర మహాసభ మొట్టమొదటి అధ్యక్షుడు. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 1953 ఆగస్టు 25న కన్నుమూశారు.

గ్రానైట్ యూనిట్‌కు అనుమతి ఇవ్వరాదు

శిడ్లఘట్ట, మే 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పురబైరేనహళ్ళిలో గ్రానైట్ కట్టింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనుమతి ఇవ్వరాదని పీడీఓకు గ్రామస్తులు విన్నవించారు. పురబైరేనహళ్ళి చుట్టుపక్కల రాతిపనిపై ఆధారపడ్డ సంప్రదాయ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. దిబ్బూరహళ్ళి గ్రామ పంచాయతీ పురబైరేనహళ్ళి వద్ద గ్రానైట్ కట్టింగ్ అండ్ ప్రాసెస్ యూనిట్‌కు వివిధశాఖలు అనుమతి ఇచ్చాయని అయితే అందుకు సంబంధించి గ్రామపంచాయతీ తరపున పర్మిషన్ ఇవ్వరాదని పీడీఓ రమేశ్‌ను కోరారు. రాజు మాట్లాడుతూ పురబైరేనహళ్ళి ప్రభుత్వ గోమాళలో 50-60ఏళ్లుగా అనేకమంది సంప్రదాయక రాతి పనిచేసి జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం గోవిందరాజు అనే వ్యక్తి గ్రానైట్ కట్టింగ్, క్రషర్ ప్రారంభించేందుకు అనుమతులు తెచ్చుకున్నారని అయితే పంచాయతీ నుంచి ఇంకా పర్మిట్ కోసం ఇ-ఖాతాకోసం అర్జీ దాఖలు చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో వందలాది కుటుంబాల వీధిన పడకుండా ఉండాలంటే సంప్రదాయ వృత్తిని కాపాడాలని కోరారు. పీడీఓ రమేశ్ మాట్లాడుతూ గోవిందరాజు అనే వ్యక్తి పుబైరేనహళ్ళి సర్వే 43లో 2 ఎకరాలలో ఫ్యాక్టరీకోసం భూపరివర్తన చేసు కున్నారన్నారు. అందుకు ఇ-ఖాతాకోసం అర్జీ సమర్పించారన్నారు. అక్కడ గ్రానైట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించదలిచినట్టు పేర్కొన్నారన్నారు. ఈ విషయం గ్రామసభలో ప్రస్తావించగా 8మంది సభ్యులు అంగీకరిస్తే, మరో ఆరుగురు వ్యతిరేకించారన్నారు. మెజారిటీ ఆధారంగా గోవిందరాజు ఇచ్చిన అర్జీని పరిగణించవచ్చునన్నారు. అయితే చట్టపరమైన సమస్యలు, ఇతరత్రా బలమైన కారణం ఉంటే మాత్రమే తిరస్కరించే అవకాశం ఉంటుందన్నారు. కొండప్ప గారహళ్ళి విజయకుమార్ మాట్లాడుతూ తాతముత్తాల కాలం నుంచి రాతిపని ద్వారా కూలి పనితో జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రానైట్‌కట్టింగ్ వల్ల మాకు సమస్య తలెత్తనుందన్నారు.



పీడీఓకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగం, ఉపాధి అవకాశాలు సాధ్యమని వైద్యవిద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్‌పాటిల్ అభిప్రాయపడ్డారు. నగరంలో మంగళవారం ప్రైవేట్ హోటల్‌లో నైపుణ్యాభివృద్ధి శాఖ జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పథకంలో భాగంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య పథకం, సీఎక్స్ఓ సమావేశం, పూర్వ విద్యార్థుల సభలో పాల్గొని మాట్లాడారు. యువతకు నైపుణ్యం కల్పించడం ద్వారా జీవనానికి మార్గం కల్పించే ప్రముఖ వేదికగా సీఎక్స్ఓ సమావేశం దోహదపడనుందన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు స్వావలంబన కల్పించి నైపుణ్యా అవకాశాలు పెంచడమే పథకం ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రప్రభుత్వం యువతకోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువనిధి లబ్ధిదారులకు ఆర్థిక చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా శిక్షణకు ఎంపికైనవారికి ఆఫర్ లెటర్‌లను అందచేశారు.



ఆఫర్ లెటర్లతో విద్యార్థులు

ఉత్సాహంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం



కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు

శిడ్లఘట్ట, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఎస్ఎస్ రేంజర్స్ అండ్ రోవర్స్, రెడ్‌క్రాస్ కల్చరల్, కోటి మహిళా సమితి సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. పాఠశాల అభివృద్ధి సమితి సభ్యులు నాగరాజ్ మాట్లాడుతూ సమాజంలోని ప్రముఖ వ్యక్తులుగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యావంతులు ఏ హోదాలో ఉన్నా సమాజ ఉన్నతికి సాధ్యమన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆత్మీయంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి ఆనంద్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ జీఎల్ విజయేంద్రకుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ షఫీ అహ్మద్ సుగుణ, ఆదినారాయణప్ప, ప్రొఫెసర్ వెంకటేశ్, కళాశాల అభివృద్ధి సమితి సభ్యులు విజ్జం నాగరాజు, ప్యారాజాన్ పాల్గొన్నారు.

అర్థవంతంగా జీవించాలి

▸▸ విద్యార్థులకు మాజీ ప్రిన్సిపాల్ కృష్ణప్ప పిలుపు

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): జీవితం చాలా గొప్పదని అర్థవంతంగా బతికి పదిమందికి ఆదర్శంగా ఉండాలని మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అకడమిక్ ముగింపు సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఉద్దేశించి కృష్ణప్ప మాట్లాడుతూ ప్రస్తుతం 5జీ కాలంలో ఉన్నామని, సాంకేతికత పరిజ్ఞాన విస్తృతమైందన్నారు. ఒత్తిడితో జీవనం సాగిస్తున్నామని సోషల్‌మీడియాలో క్షణాలలో ఎటువంటి సమాచారమైనా తెలిసిపోతుందన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని ఉత్తమమైన జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా ఒలింపిక్ క్రీడాకారుడు సుర్జిత్‌సింగ్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. హాస్య కళాకారిణి ఇందుమతి సాలిమఠతోపాటు పలువురు పాల్గొన్నారు. విద్యార్థులకు పట్టాలతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక ప్రదర్శనలో రాణించినవారికి బహుమతులు ప్రదానం చేశారు.



వేదికపై కృష్ణప్ప తదితరులు

లివర్‌పూల్ క్యాంపస్ ఏర్పాటుపై హర్షం



వేదికపై సీఎం, బ్రిటీష్ హైకమిషనర్ తదితరులు

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఇంగ్లండ్ దేశం రస్సెల్ గ్రూప్‌కు చెందిన లివర్‌పూల్ యూనివర్సిటీ నగరంలో తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంపై సీఎం సిద్దరామయ్య హర్షం వ్యక్తం చేశారు. నగరంలో మంగళవారం రాత్రి ఏర్పాటైన కార్యక్రమంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు, యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. విదేశీ యూనివర్సిటీ తన ప్రతిష్టాత్మక క్యాంపస్‌ను నగరంలో చేయనుందని 2026 నాటికి అందుబాటులోకి రానుందన్నారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ చంద్రు అయ్యర్ మాట్లాడుతూ యునైటెడ్ కింగ్‌డమ్, ఇండియాల మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయన్నారు.

స్టార్టప్‌ల ద్వారా ఆధునిక ఆవిష్కరణలు

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): స్టార్టప్‌ల ద్వారా ఆధునిక ఆవిష్కరణలు సాధ్యమవుతున్నాయని గ్రూప్ ఇంక్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ జాన్ కుయన్నా అభిప్రాయపడ్డారు. డీప్‌టెక్, ఇన్నోవేషన్ ఫోరం సదస్సు మంగళవారం నగరంలో జరిగింది. డీప్ టెక్ టెక్నాలజీ ఆవిష్కరణల సదస్సులో పయనీరింగ్ లీడర్స్, ఎంటర్‌ప్రెన్యూర్స్, అడకమిక్స్, పాలసీమేకర్స్ విభాగాలలో రాణిస్తున్నవారు భాగస్వామ్యులయ్యారు. 150మంది సదస్సులో పాల్గొన్నారు. స్టార్టప్ ఫౌండర్స్ ఇన్వెస్టర్స్, రీసెర్చర్స్ పాల్గొన్నారు. స్వయం రోబోట్స్ సీఈఓ ఫౌండర్ సంజీవ్‌శర్మ, నెక్స్ట్ బిగ్ ఇన్నోవేషన్స్ ల్యాబ్స్ ఎండీ అలోక్ మడికపుర అనిల్, ది ఇప్లేన్ కంపెనీ శుభశ్రీ కృష్ణన్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. జర్మనీకి చెందిన ఆఫ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్, ఫ్యూచర్ ఐసిటీ ఫోరం భాగస్వామ్యంతో సదస్సు జరిగింది. స్వయాత్ రోబోట్స్, టెక్నాలజీ యూనివర్సిటీల మధ్య ఒప్పందాలు చేసుకుని పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామని పలువురు ప్రకటించారు.

విద్యతోనే భవిష్యత్తు

దొమ్మసంద్ర, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యతోనే వ్యక్తి జీవితం ముడిపడి ఉందని వక్తలు పేర్కొన్నారు. చక్కటి విద్యద్వారా సామాజిక ప్రగతి సాధ్యమన్నారు. ఆనేకల్ తాలూకా అత్తిబెలెలోని ఏపీఎస్ విద్యాసంస్థ ఆవరణలో లిటిల్‌సన్‌షైన్ ఇంటర్నేషనల్ ప్రి-స్కూల్‌లో తరగతులను అక్షరాభ్యాసం ద్వారా ప్రారంభించారు. ఆధ్యాత్మిక గురువు లక్ష్మీనారాయణ్ ఆచార్య సాన్నిధ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యాసంస్థల ఫౌండర్ కార్యదర్శి మునిరాజు మాట్లాడుతూ హిందూ ధర్మం ప్రకారం పిల్లలకు ఏటా అక్షరాభ్యాసం చేయిస్తున్నామన్నారు. ధర్మావతి మునిరాజు, దిలీప్, మంజు, దీపశ్రీ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

బెంగళూరు, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని ఆ దిశగా విద్యాసంస్థలలో వాతావరణం ఉండాలనే అన్ని సౌలభ్యాలతో కూడిన సంస్థలను ర్యాన్ ఏర్పాటు చేస్తోందని ఎండీ డాక్టర్ గ్రేస్ పింటో అభిప్రాయపడ్డారు. మాగడిరోడ్డులో మంగళవారం పదో శాఖను లాంఛనంగా ప్రారంభించారు. ర్యాన్ ప్రతి శాఖలోనూ చిన్నారులలో చదువుతోపాటు క్రీడలు, కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పరిశోధనలు, నైపుణ్య ఆధారిత విద్య మా లక్ష్యమన్నారు. ర్యాన్ పింటో మాట్లాడుతూ 25ఏళ్లలో నగరంలో పదిశాఖలు ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ ప్రతిమాపాటిల్ పలువురు పాల్గొన్నారు.